దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పలువురు కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాష్ట్రంలో 'యూనిలివర్' పెట్టుబడి

కామారెడ్డిలో పామాయిల్, సీసా మూతల యూనిట్ల ఏర్పాటు

ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ 'యూనిలివర్' తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ, రిఫైనింగ్ యూనిట్‌తో పాటు బాటిల్ క్యాప్‌ల (సీసా మూతల) తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి పేరొందిన 'యూనిలివర్' మన దేశంలో హిందుస్థాన్ యూనిలివర్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న విషయం తెలిసిందే. 'యూనిలివర్' గ్లోబల్ సీఈవో హీన్ షూమేకర్‌తోపాటు ఆ కంపెనీ చీఫ్ సప్లైచైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల అనంతరం ఈ ఒప్పందం ఖరారైనట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

స్కైరూట్ రూ.500 కోట్ల పెట్టుబడి

డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొంటున్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం మంగళవారం తెలంగాణ పెవిలియన్‌లో వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు 'స్కైరూట్' కంపెనీ ముందుకొచ్చింది. రూ.500 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నది. సప్లయ్ చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాల్లో ఖ్యాతి పొందిన 'ఎజిలిటీ లాజిస్టిక్స్' కంపెనీ వైఎస్ చైర్మన్ తారెక్ సుల్తాన్‌తో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు.

మార్కెట్‌కు ట్రంప్ సెగ



ముంబై, జనవరి 21: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలకు లోనయ్యాయి. ఉదయం ఆరంభంలో లాభాల్లో కదలాడినా.. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,235.08 పాయింట్లు లేదా 1.60 శాతం కోల్పోయి 75,838.36 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 1,431.57 పాయింట్లు పడిపోయింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 320.10 పాయింట్లు లేదా 1.37 శాతం దిగజారి 23,024.65 వద్ద స్థిరపడింది. గత ఏడాది జూన్ 6 తర్వాత ఈ స్థాయికి సూచీ రావడం ఇదే తొలిసారి. కాగా, ఇంట్రా-డేలో నైతే 367.90 పాయింట్లు పతనమైంది.

ఇదీ సంగతి..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా దెబ్బతీశాయి. అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులతో ఇతర దేశాల ఆర్థికావకాశాలు క్షీణిస్తాయన్న భయాందోళనలు మదుపరుల్లోనూ చెలరేగాయి. ఫలితంగా స్టాక్ మార్కెట్లలో అలజడి చోటుచేసుకున్నది. నిజానికి ఎన్నికల ప్రచారంలోనే పొరుగు దేశాల నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై సుంకాలను 10 నుంచి 20 శాతం విధిస్తామని, చైనా నుంచి వస్తున్నవాటికైతే టారీఫ్‌లు 60 శాతంగా ఉంటాయని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడూ ట్రంప్.. సుంకాల సమరానికి కాలు దువ్విన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడూ అదే సంకేతాలు వస్తున్నాయి. వచ్చే నెల మొదలు కెనడా, మెక్సికోల నుంచి జరిగే దిగుమతులపై దాదాపు 25 శాతం సుంకాలు విధించే యోచనలో ఉన్నామని ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఆ రెండు దేశాల నుంచి అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలు జరుగుతున్నాయని, నార్కోటిక్స్ వస్తున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్నారు. వీటిని అరికట్టేందుకే సుంకాలను పెంచాలని చూస్తున్నట్టు చెప్పారు. మున్ముందు ఇతర దేశాలపైనా ట్రంప్ ఇదే దుందుడుకు వైఖరి ఉంటుందన్న అంచనాలొస్తున్నాయి.

రంగాలవారీగా..

రియల్టీ రంగ షేర్లు గరిష్ఠంగా 4.22 శాతం నష్టపోయాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 3.99 శాతం, సర్వీసెస్ 2.86 శాతం, పవర్ 2.63 శాతం, టెలికం 2.52 శాతం చొప్పున తగ్గాయి. జొమాటో షేర్ విలువ అత్యధికంగా 10.92 శాతం పడిపోగా.. ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లూ పతనమయ్యాయి. ఇక ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్ సూచీలు లాభపడగా.. చైనా, దక్షిణ కొరియా ఇండెక్స్‌లు నష్టపోయాయి. కాగా, విదేశీ సంస్థాగత మదుపరులు ఒక్కరోజే రూ.5,920 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు చెప్తున్నాయి.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో ఆయా కంపెనీల మార్కెట్ విలువ కూడా అదే రీతిలో క్షీణించింది. ఈ ఒక్కరోజే మదుపరుల సంపద రూ.7.52 లక్షల కోట్లు ఆవిరైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 7,52,520.34 కోట్లు తరిగిపోయి రూ.4,24,07, 205.81 కోట్లు లేదా 4.90 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. బీఎస్ఈలో మొత్తం 4,088 షేర్లు ట్రేడ్ అవగా, 2,881 షేర్లు నష్టపోయాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్ క్యాప్ 1.94 శాతం చొప్పున నిరాశపర్చాయి.

నష్టాలకు ప్రధాన కారణాలు

- అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు
- వాణిజ్య యుద్ధం దిశగా ట్రంప్ అడుగులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం
- భారత్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడులు
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం

ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్!

పరిచయం చేసే యోచనలో సెబీ • గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టడానికే

ముంబై, జనవరి 21: గ్రే మార్కెట్ కార్యకలాపాల నిరోధానికి ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌ను పరిచయం చేసే యోచనలో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఉన్నది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)లో కేటాయించిన షేర్లను ఇన్వెస్టర్లు వెంటనే అమ్ముకునేలా ఓ వ్యవస్థను తీసుకురావాలనుకుంటున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మదాబీ పురీ బచ్ మంగళవారం ఇక్కడ తెలిపారు. తద్వారా గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్ పెట్టాలని చూస్తున్నట్టు చెప్పారు. రెండు అగ్రశ్రేణి ప్రాక్సీ అడ్వైజరీ సంస్థలు ఈ పనిలోనే నిమగ్నమయ్యాయని, త్వరలోనే ఓ పోర్టల్ ప్రారంభం కావచ్చన్నారు. సదరు లావాదేవీలన్నీ ఇందులో నిక్షిప్తమవుతాయని, కంపెనీల్లో పాలనాపరమైన ప్రమాణాలను నిర్వహించడంలోనూ ఇది దోహదపడగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సెబీ ఏం చేస్తున్నదంటే..

ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున ఐపీవోలు వస్తున్న విషయం తెలిసిందే. అలాగే లిస్టింగ్ రోజున భారీ లాభాలనూ నమోదు చేస్తున్న సంగతీ విదితమే. కానీ దీనికి కారణం గ్రే మార్కెట్ కార్యకలాపాలేనని సెబీ అంటున్నది. ఐపీవో ముగిసిన దగ్గర్నుంచి షేర్లు స్టాక్ మార్కెట్లలో నమోదు కావడానికి మధ్య ప్రస్తుతం 3 రోజుల విరామం ఉంటున్నది. ఈ సమయంలో ఇన్వెస్టర్లు, ఆథరైజ్డ్ కాని డీలర్ల నడుమ అనధికార, నియంత్రణలేని క్రయవిక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటినే గ్రే మార్కెట్ కార్యకలాపాలుగా పేర్కొంటున్నారు. అందుకే అనధికారికంగా జరుగుతున్న ఈ లావాదేవీలకు.. మదుపరులు కోరుకుంటే సక్రమ రీతిలో ఎందుకు జరుగడానికి అవకాశం ఇవ్వొద్దని ఆలోచించామని బచ్ చెప్తున్నారు. ఐపీవోలో షేర్ల కేటాయింపు జరిగిందంటే అది లీగలేనని, వాటిని అమ్ముకునే హక్కు కొన్నవారికి ఉంటుందని చెప్పారు. అందులో భాగంగానే ఐపీవో షేర్లలో ప్రీ-లిస్టింగ్ ట్రేడింగ్‌కు అనుమతిచ్చే దిశగా వెళ్తున్నట్టు తెలిపారు.

బ్రాండ్లలో మేటి.. భారతీయ ఐటీ

అత్యంత విలువైన సంస్థల్లో టీసీఎస్, ఇన్ఫీ, హెచ్‌సీఎల్

బ్రాండ్ ఫైనాన్స్ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 21: దేశీయ ఐటీ దిగ్గజాలు అంతర్జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన సంస్థల జాబితాలో ఐదు సంస్థలు చోటు దక్కించుకున్నాయి. వీటిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రాలు ఉన్నాయని బ్రాండ్ ఫైనాన్స్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా టాప్-10 విలువైన సంస్థల్లో అమెరికా ఎప్పటిలాగే 40 శాతంతో తొలిస్థానంలో నిలిచింది. 36 శాతం వాటాతో భారత్ ఆ తర్వాతి స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. యూఎస్ టెక్నాలజీ దిగ్గజం యాక్సెంచర్ వరుసగా ఏడోసారి అత్యంత విలువైన సంస్థగా తన స్థానాన్ని కొనసాగించింది. దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 21.3 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ(11 శాతం ఎగబాకింది)తో రెండో స్థానం దక్కించుకున్నది. వరుసగా నాలుగోసారి ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. మరోవైపు, 2025లో అత్యంతవేగవంతమైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా హెచ్‌సీఎల్ టెక్నాలజీ అవతరించిందని పేర్కొంది. గడిచిన ఐదేండ్లుగా తొలిస్థానంలో ఉన్న ఇన్ఫోసిస్‌ను వెనక్కినెట్టి హెచ్‌సీఎల్ ఈ స్థానాన్ని దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మొత్తం ఐటీ విలువల్లో 36 శాతం వాటాతో భారత్ రెండోస్థానంలో కొనసాగుతున్నది. గత కొన్నేండ్లుగా నిరాశాజనక పనితీరు కనబరిచిన అమెరికా మార్కెట్ తిరిగి పుంజుకోవడం దేశీయ ఐటీ సంస్థలకు కలిసొచ్చిందని, ముఖ్యంగా నూతన ఆర్డర్లు రావడంతో దేశీయ ఐటీ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. మూడోస్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం ఎగబాకి 16.3 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే స్థానంలో కొనసాగడం వరుసగా నాలుగోసారి. ఇన్ఫోసిస్ సీఈవో పరేఖ్ నాయకత్వంలో సంస్థ అన్ని విభాగాల్లో రాణిస్తున్నదని, పనితీరు మెరుగుపడటంతోపాటు ఇన్నోవేషన్‌లో దూసుకుపోతున్నదని పేర్కొంది. అలాగే హెచ్‌సీఎల్ టెక్నాలజీ బ్రాండ్ విలువ 17 శాతం ఎగబాకి 8.9 బిలియన్ డాలర్లకు చేరుకోగా, విప్రో విలువ 6 బిలియన్ డాలర్లు కాగా, టెక్ మహీంద్రా కూడా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. అలాగే టాప్-25 గ్లోబల్ ర్యాకింగ్ సంస్థల్లో తొలిసారిగా హెక్సావేర్ టెక్నాలజీ ప్రవేశించింది.

హెచ్‌సీఎల్ టెక్ విస్తరణ

హైదరాబాద్, జనవరి 21: హెచ్‌సీఎల్ టెక్నాలజీ..హైదరాబాద్‌లో నూతన సెంటర్‌ను ప్రారంభించింది. అంతర్జాతీయ క్లయింట్లకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌మిషన్ సొల్యూషన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో నగరంలో కొత్తగా సెంటర్‌ను ఆరంభించినట్లు కంపెనీ సీఈవో, ఎండీ సీ విజయకుమార్ తెలిపారు. హై-టెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 5 వేల మంది కూర్చోవడానికి వీలుంటుందన్నారు.

విప్రో కన్స్యూమర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

హైదరాబాద్, జనవరి 21: విప్రో అనుబంధ సంస్థయైన విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్ సంస్థ..హైదరాబాద్‌లో ఐవోటీ ఆధారిత ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో అత్యాధునిక లైటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు, దేశంలో ఇది రెండో సెంటర్‌ని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ అనూజ్ ధీర్ తెలిపారు.

రుణమాఫీ చేయండి

కేడీసీసీ బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన

రామగిరి పీఎస్‌లో అధికారులపై ఫిర్యాదు

బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రామగిరి జనవరి 20 : తమకు రుణమాఫీ చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ కేడీసీసీ బ్యాంక్ ఎదుట మంగళవారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, గతంలో బ్యాంక్ మేనేజర్‌గా ఉన్న రామకృష్ణ చేసిన తప్పిదం వల్ల తమ 56 మంది రైతుల ఖాతాలో డబ్బులు జమకాలేదని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వేంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అందోళన సమాచారం అందుకున్న రామగిరి ఎస్ఐ దివ్య పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. రుణమాఫీ అందకుండా తమ పాత అకౌంట్ క్లోజ్ చేసి కొత్త అకౌంట్ తెరచి సైబర్ నేరానికి పాల్పడ్డారని, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా రైతులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించడంతో రైతులు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో అఖిల పక్ష పార్టీల నాయకులు మూల్మారి శ్రీనివాస్, పల్లె ప్రతిమ, పీవీ రావు, జనగామ రవికుమార్, కొండు లక్ష్మణ్, బొంకూరి పోశం పాల్గొన్నారు.

పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎనిమిది నెలల కితం ఇక్కడి కేడీసీసీ బ్యాంక్‌లో పని చేసిన మేనేజర్ రామకృష్ణ రైతుల వద్ద రుణాల వసూలులో చేసిన తతంగం వల్ల రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. రైతులు రుణం తీసుకున్న ఖాతాలను క్లోజ్ చేసి కొత్త ఖాతాలు తెరిచి రుణాలు రీషెడ్యూల్ చేయడం వల్ల ఇలా జరిగింది. 56 మందికి సంబంధించిన పాత అకౌంట్ క్లోజ్ అయినప్పటికి మాఫీ మాత్రం రైతుల పాత ఆకౌంట్‌లకు అయింది. దీంతో రైతులకు రుణమాఫీ కాకుండా పోయింది. ఈ సాంకేతిక సమస్య వల్ల జరిగిన పొరపాటును మా బ్యాంక్ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

- సెంటినరీకాలనీ కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ గాంధీ నాయక్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మంథని, జనవరి 21: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి మంథని ఫైర్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని కాకతీయ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఇన్‌స్పెక్టర్ శివ శంకర వరప్రసాద్ ప్రారంభించారు. ఇక్క ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్లు రవికిరణ్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సందర్శన

జూలపల్లి, జనవరి 21 : చీమలపేటలోని ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు సందర్శించారు. పాఠశాల భవనంలో పెచ్చులూడిన పైకప్పు, పగుళ్లు తేలిన గోడలు, తేలిన ఇనుప చువ్వలు, ఊడిన తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించారు. వానాకాలంలో ప్రైవేట్ ఇళ్లల్లో బోధన కొనసాగిస్తున్నారని స్థానికులు తెలిపారు. పాఠశాలను బాగు చేయించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలి

బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

దీక్షలో కూర్చున్న దాసరి ఉష

పెద్దపల్లి, జనవరి 21: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఈ కార్యాలయ ఆవరణలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్(టీవీఏసీ) జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని మంగళవారం దాసరి ఉషతో పాటు సీపీఐ నాయకుడు తాండ్ర సదానందం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడారు. ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతల సంతోష్, చిట్టవేని వినీత్, ఎండీ సోహెల్, దాసరి సతీష్, శ్రీను, ఆముదల అరుణ, టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ మల్లోరి కిషన్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మట్ట రాజు, కో -చైర్మన్లు దుర్గం విశ్వనాథ్, ఎం ఎల్లయ్య, కో -కన్వీనర్ కాంపెళ్లి రఘు, జడల సత్యం, కోశాధికారి దేవేందర్ పాల్గొన్నారు.

బాలికల సాధికారత వర్క్‌షాప్ ప్రారంభం

జ్యోతినగర్, జనవరి 21: బాలికల సాధికారత కోసం రామగుండం ఎన్టీపీసీ యాజమాన్యం మంగళవారం ఈడీసీ మిలినీయం హాల్‌లో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ వర్క్ షాప్‌ను ప్రారంభించింది. ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెన్సీ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠి వర్క్ షాపును ప్రారంభించారు. నాన్ రెసిడెన్షియల్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినులకు స్కిల్డ్ డెవలప్‌మెంట్, ఆర్ట్, క్రాఫ్ట్, రిఫ్రెషర్ కోర్సు, నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 50మందికి పైగా విద్యార్థినులు పేర్లు నమోదు చేసుకున్నారు.ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి, బాల్ భవన్ ఇన్‌చార్జి రూప సింగరాయ్, దీప్తి మహిళా సమితి సభ్యురాలు మల్లిక, హెచ్ ఆర్ అధికారులు, ఉద్యోగులు ఉన్నారు.

విద్యార్థులకు అభిందన

ధర్మారం,జనవరి 21: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మండలంలో పర్యటించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన టీ మనోజ్ఞ, బీ సింధుప్రియ, బీ వైష్ణవి, ఏ రంజిత్ కుమార్ బీ ఆశ్రితను సన్మానించారు. ఈనెల 24 నుంచి 27 వరకు మహారాష్ట్రలో జరిగే అండర్ -19 ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికైన బీ వైష్ణవికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ కోసం తన నెల జీతం అందజేస్తానని విప్ హామీ ఇచ్చారు. ధర్మారంలోని వడ్డెర కాలనీకి చెందిన సంపంగి జంపయ్య ఇటీవల బెంగుళూర్‌లో హఠన్మారణం చెందగా, మృత దేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. అనంతరం నంది రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఈఈ స్వామి, డీఈఈ బుచ్చిబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. రిజర్వాయర్‌లో 226 మీటర్ల వరకు వరకు నిల్వ చేసి మిగతా అదనపు నీటిని ఎగువ ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు.

24 గంటల్లో సదరం సర్టిఫికెట్

పెద్దపల్లి, జనవరి 21: ఇక నుంచి సదరం సర్టిఫికెట్ కేవలం 24 గంటల్లో పొందవచ్చని కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఆర్డీవో కార్యాలయంలో 24 గంటల తర్వాత పొందవచ్చని ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు వినియోగించుకోవాలని కోరారు.

16మందికి కారుణ్య నియామకపు ఉత్తర్వులు

గోదావరిఖని, జనవరి 21: సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో 16మందికి కారుణ్య ఉద్యోగ నియామకపు ఉత్తర్వులను ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ తన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఇందులో 11మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. ఇక్కడ ఎస్‌వో టూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, సీఎం వోఏఐ ప్రతినిధి క్రాంతి, ఏఐటీయూసీ నాయకులు రంగుశ్రీను, ఏరియా ఇంజినీర్ డీవి రావు, ఏజీఎం ఐఈడీ ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీఓలు శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, జీఎం ఆఫీస్ ప్రతినిధి రాజు, సంతోష్ ఉన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో గాయత్రి విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కమాన్, జనవరి 21 : ఇటీవల నిర్వహించిన నాసో ఒలింపియాడ్ పరీక్షలో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు కర్ర రుహిక, అల్లెంకి మహాలక్ష్మి, నూర్ ఫాతిమా, ఎన్ హరిణి, ఎన్ శ్రీహిత, ఎ సాత్విక్‌తేజ, ఎం మన్విత్, ఎ. హవీష్ జై, కే వర్షికకు గోల్డ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు, ఎస్ అక్షయ, కే శివ స్వరూప్, ఎస్ యశస్వికి ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. ఇక్కడ కరస్పాండెంట్ అల్లెంకి రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియొద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్

ఆర్చరీ క్రీడాకారిణి చికిత్సకు రూ.10లక్షల సాయం

- అక్షర విద్యాసంస్థల నుంచి స్పోర్ట్స్ స్కాలర్ షిప్ మంజూరు

చెక్కు అందజేస్తున్న జగన్ మోహన్‌రావు

పెద్దపల్లి, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఆర్చరీ వరల్డ్ కప్, ఆసియాకప్‌కు ఎంపికైన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన యువ ఆర్చరీ క్రీడాకారిణి టీ చికిత్సకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ అర్మన పల్లి జగన్ మోహన్‌రావు అండగా నిలిచారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని జగన్ మోహన్‌రావు కార్యాలయంలో ఆయనను చికిత కలువగా, అభినందించారు. సాధారణ రైతు కుటుంబ నుంచి అంతర్జాతీయ స్థాయి ఆర్చర్‌గా ఎదిగిన చికితకు సరైన ప్రోత్సాహం లేక ఇబ్బంది పడుతుందని తెలుసుకున్న ఆయన, చికితకు అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అక్షర విద్యా సంస్థల నుంచి రూ.10 లక్షల స్పోర్ట్స్ స్కాలర్ షిప్ ఇవ్వనున్నట్లు జగన్ మోహన్ రావు ప్రకటించారు. తొలి విడతగా రూ.50 వేల చెక్‌ను అందించగా, వచ్చే ఫిబ్రవరి నుంచి శిక్షణ నిమిత్తం ప్రతి నెల రూ.15 వేల ఉపకార వేతనం ఐదేండ్లపాటు అక్షర విద్యా సంస్థల నుంచి ఇవ్వనున్నామని వివరించారు.

చై